క్లుప్తంగా

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

తీరనున్న కమాల్‌పూర్‌–రాస్నం రోడ్డు సమస్య



బాగాయిపల్లి సమీపంలో చేపడుతున్న బీటీ రోడ్డు పనులు

యాలాల: మండలంలోని కమాల్‌పూర్‌ నుంచి పగిడియాల మీదుగా రాస్నం వరకు చేపట్టిన రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఏడాది క్రితం రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించడంతో వాహనదారులు, ప్రయాణీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫేస్‌ రికగ్నైజేషన్‌తో అవకతవకలకు బ్రేక్‌



పింఛన్‌ డబ్బులు అందజేస్తున్న ఎంపీఓ గాలి యాదయ్య

యాలాల: ఫేస్‌ రికగ్నైజేషన్‌తో పింఛన్‌ డబ్బులు అందజేస్తే అవకతవకలకు బ్రేక్‌ పడుతుందని మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముద్దాయిపేటలో ఫేస్‌ రికగ్నైజేషన్‌ పద్ధతిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో పింఛన్ల పంపిణీలో అవినీతి, అక్రమాలకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఈ విధానంతో అలాంటివాటిని దూరం చేయొచ్చన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఫేస్‌ రికగ్నైజేషన్‌ ప్రక్రియతో పింఛన్‌ డబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తపాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఐఎం అధ్యక్షుడిగా మోయిజ్‌ఖురేషి



సమద్‌బిన్‌ అబ్బాద్‌ను సన్మానిస్తున్న ఎంఐఎం మండల నూతన కార్యవర్గం

ధారూరు: మండల ఎంఐఎం అధ్యక్షుడిగా మోయిజ్‌ఖురేషిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదారాబాద్‌ నుంచి వచ్చిన సమద్‌బిన్‌ అబ్బాద్‌ ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించి అందరిని ఏకతాటిపైకి తీసుకవచ్చి అబ్దుల్‌ రహీంను ధారూరు పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. ఇతనితో పాటు మండల కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల ఎంఐఎం ప్రధాన కార్యదర్శిగా మహ్మద్‌ సల్మాన్‌, సేయింట్‌ కార్యదర్శులుగా ముస్తాఫా, అల్తాఫ్‌ అలీ, ఇలియాజ్‌, సలావుద్దీన్‌, సయ్యద్‌ నబీలు, కోశాధికారిగా మహ్మద్‌ నబీల్‌, సభ్యులుగా ఉస్మాన్‌, షేక్‌ ఆరీఫ్‌, నవాజ్‌, ముజాయిద్‌, ఫయాజ్‌, నజీర్‌ అహ్మద్‌, ఎండి ఖాసీం, డాక్టర్‌ అమానుల్లా, నయిమ్‌, సిరాజ్‌, వదావూద్‌, మునీర్‌, ఎండి నవాజ్‌లను నియమించారు. అనంతరం సమద్‌బిన్‌ అబ్బాద్‌ను నూతన కార్యవర్గం సన్మానించారు.

ఆత్మ కమిటీ చైర్మెన్‌కు సన్మానం

పూడూరు: ఆత్మ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన మంచన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిని పలువురు నాయకులు సన్మానించారు. మండల పరిధిలోని రాకంచర్ల శ్రీయోగానంద లక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో కాంగ్రెస్‌ నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ర్యాలీగా పరిగి క్యాంపు కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మెన్‌ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్‌, డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శకీల్‌, శ్రీనివాస్‌, పెంటయ్య, అజీంపటేల్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ రమేష్‌కుమార్‌, సొసైటీ డైరెక్టర్‌ చెన్నయ్యగౌడ్‌, నాయకులు రాంచంద్రయ్య, సురేశ్‌, అమర్‌నాథ్‌, నారాయణ, రవి, జాఫర్‌, వీరేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నవీన్‌జోషి

పూడూరు: బీజేవైఎం పూడూరు మండల అధ్యక్షుడిగా నవీన్‌జోషిని నియమిస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూంపల్లి రాఘవేందర్‌ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని యువతను చైతన్యం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో యువజన కమిటీలు వేసి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా అవగాహన కల్పిస్తానన్నారు.

క్షయతో.. జాగ్రత్త

తెమడ పరీక్ష, ఎక్స్‌రేతో గుర్తింపు

- సకాలంలో చికిత్స అందిస్తే అరికట్టొచ్చు
- టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ పేరిట అవగాహన సదస్సులు

దౌల్తాబాద్‌: క్షయను టీబీ అని కూడా అంటారు. ఈ పేరు వింటేనే భయపడుతారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నయం చేయొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇది ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి. దీని బారిన పడిన వారికి ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు అందజేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పరంగా పౌష్టికాహారం తీసుకోవడానికి కొంత మేర ఆర్థిక సాయంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఇటీవల మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక వైద్య బృందం సదస్సులతో పాటు చికిత్సలు చేపడుతున్నారు. గత నెలలో ప్రారంభమైన టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ పేరుతో వైద్య బృందం గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు బాలంపేట, ఈర్లపల్లి, మాటూరు, కుదురుమళ్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సేవలు అందజేశారు. ఇప్పటి వరకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో దాదాపు 60 మంది ఈ వ్యాధికి గురైనట్లు నిర్ధారించారు. వారు ఈ విషయంలో భయపడాల్సిన అవసరం లేదని, సకాలంలో చికిత్సలు చేయించుకుంటే ప్రాణభయం నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు వివరిస్తున్నారు.

చేపడుతున్న చర్యలు..

వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే టీబీ యూనిట్‌ విభాగానికి వెళ్లాలి. తెమడ పరీక్ష, ఎక్స్‌రే ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ఈ వ్యాధి సోకిన వారికి ఆరు నెలల పాటు ఉచితంగా మందులు అందజేస్తారు. అంతేకాకుండా వారికి నెలకు కొంత ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుంది.

ఇవీ వ్యాధి లక్షణాలు

దీర్ఘకాలిక దగ్గు, ఛాతి నొప్పి, అలసట, బరువు తగ్గడం, రాత్రి చెమటలు, జ్వరం, శ్వాస ఆడకపోవడం రక్తంతో కూడిన దగ్గు, ఆకలి వేయకపోవడం వంటి లక్షణాలు మనిషిలో ఉంటే క్షయగా గుర్తించొచ్చు. అయితే కొన్ని పరీక్షల ద్వారా దీనిని గుర్తిస్తారు. అవగాహనతో వ్యాధిని దూరం చేయొచ్చు.



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్‌)

వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మందులు వాడాలి



క్షయ బాధితులకు ప్రభుత్వ పరంగా ఉచిత పరీక్షలు, వ్యాధి సోకిన వారికి చికిత్సలు అందిస్తున్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకుని క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఇప్పటి వరకు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాం. అనుమానితులు ఎవరైనా ఉంటు దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలి.

– ప్రియదర్శిని, వైద్యాధికారిణి, దౌల్తాబాద్‌

బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయం



పార్టీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: బొట్లోనితండాలోని పలువురు యువకులు, విద్యావంతులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీలో చేరిన వారికి స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్‌ మారెమ్మ ఆలయం వద్ద తండావాసులతో నిర్వహించిన సమావేశంలో బీఆర్‌ఎస్‌ పార్టీ కండువాలు కప్పి నరేందర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్‌ పాలన, కేటీఆర్‌ నాయకత్వం గుర్తించే బీఆర్‌ఎస్‌లో చేరారని ఆయన వెల్లడించారు. తండాకు చెందిన బాలు, కాలు, రమేశ్‌, గోపాల్‌, రవి, మున్నా విశాల్‌, శంకర్‌, రాహుల్‌తో పాటు 50 మంది మహిళలు పార్టీలో చేరారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యాదగిరి, మాజీ వైస్‌ ఎంపీపీ శేరినారాయణరెడ్డి, నెహ్రూనాయక్‌, మధుయాదవ్‌, తిరుపతయ్య, హీరూ, నర్సింహానాయక్‌, నరేశ్‌, మల్లేశ్‌గౌడ్‌, రవిగౌడ్‌, అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీరోజు పౌష్టికాహారం వడ్డించాలి

మున్సిపల్‌ కమిషనర్‌ బలరాం నాయక్‌

కొడంగల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతీరోజు పౌష్టికాహారం వడ్డించాలని మున్సిపల్‌ కమిషనర్‌ బలరాం నాయక్‌ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంట సిబ్బందితో మాట్లాడారు. వంట గది, తరగతి గదులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి: ఎంపీడీఓ రాములు

బంట్వారం: మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాలసోమారం ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం రుచిగా ఉంటుందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం పెట్టాలన్నారు. మెనూ ప్రకారం గుడ్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఎందుకు ఇవ్వలేదంటూ సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పరిగి: భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటయ్య

మెనూ తప్పనిసరి

పరిగి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎలాంటి ఘటన జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శాలిని, మున్సిపల్‌ సిబ్బంది దశరథ్‌ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్‌

ధారూరు: కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక హామీల అమలును విస్మరించిందని బీఆర్‌ఎస్‌, తెలంగాణ ఉద్యమ నాయకుడు బాలరాజునాయక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం పథకాల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు రాజీవ్‌ యువ వికాసం పథకం నుంచి ఎంత మందికి లబ్ధి చేకూరిందో వివరించాలని ఆయన తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం పంపిణీ ఏమైందని ప్రశ్నించారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏ లో చేర్చాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ముదిరాజ్‌ సంఘం నాయకుల డిమాండ్‌

కొడంగల్‌: ముదిరాజ్‌లను బీసీ–ఏ లో చేర్చాలని సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. బుధవారం పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్‌ హాల్లో సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీన కొడంగల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ముదిరాజ్‌ల జనాభాకు అనుగుణంగా విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో అవకాశం కల్పించాలన్నారు. ముదిరాజులు ప్రస్తుతం బీసీ–డీ లో కొనసాగుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు కోస్గి వేణుగోపాల్‌, తాలూకా అధ్యక్షుడు రుద్రారం నర్సిములు, నాయకులు సత్యపాల్‌, తుడుం శ్రీనివాస్‌, మెరుగు వెంకటయ్య, బాబయ్య, నారాయణ, కూర వెంకటయ్య, యాదగిరి, హనుమంతు, తిరుపతయ్య, ఊరడి నారాయణ, అన్నారం పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్‌ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

దుద్యాల్‌: సాగారం తండా పాఠశాలకు అకాడమిక్‌ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని బుధవారం తండా వాసులు కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 75 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, వారందరికీ ఒకే ఉపాధ్యాయుడు భోదన చేస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాకుండా వారు చదువులో వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వెంటనే అకాడమిక్‌ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని వారు కోరారు.

ప్రజలందరు సమానమే

కరన్‌కోట్‌ ఎస్‌ఐ రాథోడ్‌ వినోద్‌



బంట్వారం: పౌర హక్కుల సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములు

తాండూరు రూరల్‌: భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ప్రజలందరు సమానమేనని కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌ఐ రాథోడ్‌ వినోద్‌ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్కాపూర్‌ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో కులవివక్ష లేకుండా జీవించాలని సూచించారు. చట్టం దృష్టిలో అందరు సమానమేనన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్‌ గోవింద్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ బాబు, మాజీ ఎంపీటీసీ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

బంట్వారం: పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. మాలసోమారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బంట్వారం ఎస్‌ఐ విమల, ఆర్‌ఐ రాంగోపాల్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తాండూరు రూరల్‌: పెద్దేముల్‌–తాండూరు కాంగ్రెస్‌ ఏ బ్లాక్‌ అధ్యక్షుడు, ఎల్‌ఎన్‌ఆర్‌ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు ఆరోగ్యంపై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరా తీశారు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చెయ్యికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుధవారం ఆసుపత్రికి వెళ్లి లొంక నర్సిములును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌, నాయకులు బంటు మల్లప్ప, జగదీష్‌, రాములు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కుల్కచర్ల: అంతారం గ్రామానికి చెందిన బోయిని ప్రభాకర్‌ విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2006–07 పదోతరగతి స్నేహితులందరూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తాత్కాలికంగా వారి కుటుంబానికి అండగా నిలవాలని ఆర్థిక సహాయం రూ. 25,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో పదోతరగతి స్నేహితులు రాజు, రాఘవేంద్ర, శ్రీనివాస్‌, కేశవులు, రాములు, కుర్మయ్య, జగదీష్‌, మన్సూర్‌, మొగులయ్య, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పాలనలో కొడంగల్‌ అభివృద్ధి

మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్‌

దౌల్తాబాద్‌: కొడంగల్‌ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. మండలంలోని చల్లాపూర్‌ గ్రామానికి మంజూరైన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి 18 నెలల్లోనే కొడంగల్‌ ప్రాంతంలో విద్యా, వైద్య రంగాల్లో ముందుఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పకీరప్ప, డైరెక్టర్‌ మల్లేష్‌, శరణయ్య, రాజప్ప, పీఆర్‌ ఏఈ నాగేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దౌల్తాబాద్‌: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కాంగ్రెస్‌ నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్నలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికీ డబుల్‌ బెడ్రూం ఇవ్వలేదని కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్‌, మాజీ ఎంపీటీసీ దస్తప్ప, నాయకులు జగన్‌గౌడ్‌, ఆలేటిసాయిలు, మాలెఅంజి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌ పేదల పార్టీ

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఆంజనేయులు

కుల్కచర్ల: కాంగ్రెస్‌ పేదల పార్టీ అని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం పీరంపల్లి గ్రామంలో కాంగ్రెస్‌ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్‌ అని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే రానున్న ఎన్నికల్లో అండగా నిలబడాలని కోరారు. రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. పీరంపల్లి గ్రామ అధ్యక్షుడిగా జంబు భీమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌ నాయక్‌, యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య, సీనియర్‌ నాయకుడు సత్యనారయణ, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌కుమార్‌ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనందం, నాయకులు నర్సింలు, రమేశ్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.



పీరంపల్లి గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకుంటున్న నేతలు

సేవాభావంతో పనిచేసేవారికి గుర్తింపు

పీఏసీఎస్‌ వైస్‌ చైర్మెన్‌ నాగరాజు, చౌడాపూర్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌

కుల్కచర్ల: సేవాభావంతో పనిచేసిన వారిని ప్రజలు తప్పనిసరిగా గుర్తుంచుకుంటారని పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ నాగరాజు, చౌడాపూర్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్‌ పేర్కొన్నారు. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌ గ్రామానికి చెందిన లింగప్ప చౌడాపూర్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..పేద ప్రజలకు రెవెన్యూశాఖలో అవసరమైన సహాయసౌకర్యాలు అందజేశారని గుర్తు చేశారు. ప్రజల కోసం పని చేసిన అధికారులను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌ తహసీల్దార్‌ అశోక్‌ కుమార్‌, మాజీ వైస్‌ ఎంపీపీ రాజశేఖర్‌, చౌడాపూర్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వెంకటయ్య, కొత్తపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.



సీనియర్‌ అసిస్టెంట్‌ లింగప్ప ఉద్యోగ విరమణలో పాల్గొన్న నేతలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నూతన రేషన్‌ కార్డుల ప్రొసీడింగ్‌ పంపిణీ చేస్తున్న శాంతుకుమార్‌, తదితరులు

పరిగి మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ శాంతుకుమార్‌

దోమ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ దొరిశెట్టి శాంతుకుమార్‌ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్‌ నర్సింహులు, పీఏసీఎస్‌ చైర్మన్‌ యాదవరెడ్డి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్‌ కార్డుల ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తుందన్నారు. ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌, రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఆరోగ్య శ్రీ, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు యాదయ్య, కాంగ్రెస్‌ నేతలు బోయిన నర్సింహులు, శ్రీశైలం, ఆర్‌.కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించండి

బీజేపీ నాయకుల వినతి

బంట్వారం: దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని బీజేపీ బంట్వారం మండల అధ్యక్షుడు మహేశ్‌యాదవ్‌, ప్రధాన కార్యదర్శి మల్లేశం తదితరులు బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీధర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంట్వారం మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్లన్నీ పూర్తిగా పాడై, గుంతలుగా మారాయన్నారు. తరచూ ఈ రోడ్లపై వాహనదారులు ప్రమాదాల బారిన గురవుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ విషయం గురించి సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



శ్రీధర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

పూత పద్ధతి ఎంతో మేలు

మండల వ్యవసాయాధికారి జయశంకర్‌

మోమిన్‌పేట: పత్తిలో వస్తున్న పెను బంక, దోమల నివారణకు పూత పద్ధతి ఎంతో మేలని మండల వ్యవసాయాధికారి జయశంకర్‌ పేర్కొన్నారు. మందులను పిచికారీ చేయడానికి నీరు, కూలీల ఖర్చులను అధిగమించేందుకు పూత పద్ధతి ఎంచుకోవాలన్నారు. దీనికి తోడు పిచికారీ చేయడం వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. వర్షాభావ పరిస్థితిలో పొలాల వద్ద నీరు లేక ట్యాంకరు ద్వారా నీటిని తీసుకెళ్లి పిచికారీ చేస్తే ఖర్చు పెరుగుతుందన్నారు. కూలీలు, అదనపు పెట్టుబడులను తగ్గించుకునేందుకు పూత పద్ధతి సులువని వివరించారు. పత్తిని విత్తిన 40రోజుల నుంచి పెనుబంక, దోమలు పత్తిని ఆశించి రసం పీల్చి ఎదుగుదలను ఆపేస్తాయి. దీంతో రైతుకు నష్టం వాటిల్లుతుంది. వర్షాభావ పరిస్థితుల వలన పెనుబంక ఆశించవచ్చన్నారు. విత్తిన 40, 60రోజులకు రెండు సార్లు పత్తిలో పూత పద్ధతి ద్వారా రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో పెయిటింగ్‌ రూలర్‌లు అందుబాటులో ఉన్నాయని, రసం పీల్చే పురుగుల నివారణకు 100 గ్రాముల ఎసిఫేట్‌ మందులో 400మిల్లీ లీటర్‌ నీటిని కలిపి రూలర్‌ ద్వారా పత్తి కాండంపైన పూత పూయాలని ఆయన వివరించారు. ఎకరాకు 100గ్రాముల మందు సరిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ పూత పద్ధతితో మందు, నీళ్లు, కూలీల కొరత వంటి సమస్యలను అధిగమించొచ్చని సూచించారు.